క్లుప్తంగా

సర్వేతో కుష్టు రోగుల గుర్తింపు



అవగాహన కల్పిస్తున్న వైద్యాధికారి

అద్దంకి: సర్వే ద్వారా కుష్టు రోగులను గుర్తించవచ్చని వైద్యులు పేర్కొన్నారు. కుష్టు రోగులను గుర్తించే కార్యక్రమంపై అవగాహన సమావేశాన్ని పట్టణంలోని కాకానిపాలెం అర్బన్ హెల్త్ సెంటర్‌లో శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి మాట్లాడుతూ కుష్టు రోగుల గుర్తింపు కార్యక్రమం ఏఎన్ఎం, ఆశ, వలంటీర్ ద్వారా డాక్టర్ ఎం నాగసాయి కుమార్ పర్యవేక్షణలో జరుగుతుందని చెప్పారు. కార్యక్రమం 26వ తేదీ నుంచి వచ్చే నెల 16వ తేదీ వరకు సాగుతుందన్నారు. ఆ సమయంలో అనుమానిత కేసులను గుర్తించి వారికి తగిన వైద్యం అందించాలని చెప్పారు. అనుమానిత కేసులను ఎలా గుర్తించాలో తెలియజేశారు. కార్యక్రమంలో ఎం పుష్పావతి, వీవీ నరసింహారావు, ఆశలు, ఏఎన్ఎంలు, వలంటీర్లు, వైద్యశాల సిబ్బంది పాల్గొన్నారు.

గాన గంధర్వుడు ఎస్పీ బాల సుబ్రహ్మణ్యం



మాట్లాడుతున్న నారాయణరావు

అద్దంకి: గాన గంధర్వుడు ఎస్పీ బలసుబ్రహ్మణ్యం అని సాహితీ స్రవంతి సంస్థ అధ్యక్షుడు చందలూరి నారాయణరావు అన్నారు. పట్టణంలోని చిన్ని శాంతయ్య పిచ్చమ్మ గార్ల సేవా సదన్‌లో శనివారం ప్రతిభామూర్తులు కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమం అద్దంకి ఆర్టీసీ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో నిర్వహించారు. సభకు సంఘ కార్యదర్శి హనుమంతరావు ఆహ్వానం పలికారు. ఈ సందర్భంగా నారాయణరావు మాట్లాడుతూ ఎస్పీ బాల సుబ్రహ్మణ్యం నేపథ్య గాయకుడిగా, నటుడిగా, సంగీత దర్శకుడిగా బహుముఖ ప్రజ్ఞ కలిగిన మహనీయుడన్నారు. ఆయన జీవిత విశేషాల గురించి వివరించారు. ఆంధ్రుల అన్నపూర్ణ డొక్కా సీతమ్మ గురించి పద్యకవి డీవీఎం సత్యనారాయణ వివరించారు. తొలుత ప్రతిభామూర్తుల చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో పీహెచ్ కోటయ్య, గాడేపల్లి దివాకర దత్తు, యూ దేవపాలన, అద్దంకి లెవీ ప్రసాద్, ఎం రామదాసు, ఈఎస్‌రావు, ఎస్‌కే కాలేషా, మస్తాన్, ఖాసీమ్, అల్లం సుబ్బయ్య, సాహితీ వేత్తలు, సాహిత్యాభిమానులు పాల్గొన్నారు.

నేడు చీరాలలో అష్టావధానం

చీరాల అర్బన్: సహజ సాహితీ చీరాల ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం 6.30 గంటలకు స్థానిక సంతబజారులోని వేణుగోపాల స్వామి దేవాలయంలో అష్టావధాన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు సహజ సాహితీ వ్యవస్థాపకుడు వడలి రాధాకృష్ణ శనివారం తెలిపారు. కార్యక్రమంలో అష్టావధాని దూపాటి రామచార్యులు, పృచ్ఛకులుగా అన్నదానం హనుమత్‌ప్రసాద్, వంగర శ్రీధర్, గుత్తి విశ్వేశ్వరరావు, బత్తుల బ్రహ్మారెడ్డి, సజ్జా వెంకటేశ్వర్లు, కోట నాగేశ్వరరావు, మంత్రి కృష్ణమోహన్ పాల్గొంటారన్నారు. సభా సంచాలకులుగా అన్నదానం చిదంబరశాస్త్రి వ్యవస్థారన్నారు. కార్యక్రమానికి అందరూ హాజరు కావాలని ఆయన కోరారు.

బస్సు నుంచి జారిపడి విద్యార్థినికి గాయాలు

మేదరమెట్ల: డ్రైవర్ సడన్‌గా బ్రేక్ వేయడంతో బస్సులో నుంచి విద్యార్థిని కిందపడి గాయాలయ్యాయి. ఈఘటన కొరిశపాడు మండలంలోని మేదరమెట్ల దర్గా సెంటర్ వద్ద శనివారం చోటు చేసుకుంది. తిమ్మనపాలెంలో పదో తరగతి చదువుతున్న తాటిపర్తి అనూరాధ స్కూల్ నుంచి ఇంటికి తిరిగి వచ్చే క్రమంలో ఈ ప్రమాదం జరిగింది. గాయపడిన విద్యార్థినిని స్థానిక వైద్యశాలకు తరలించారు.

అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు



కల్లవారిపాలెంలో లబ్ధిదారులతో మాట్లాడుతున్న అధికారులు

జే.పంగులూరు: అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు తప్పనిసరిగా అందజేయాలని మండల ప్రత్యేకాధికారి, హౌసింగ్ పీడీ ప్రసాద్ అన్నారు. జగనన్న సురక్ష పథకంలో భాగంగా మండలంలోని కల్లవారిపాలెం గ్రామంలో శనివారం పీడీ గ్రామంలో ఇంటింటికి తిరిగి పథకాలపై ఆరా తీశారు. కార్యక్రమంలో ఎంపీడీవో రామాంజినేయులు, రెవెన్యూ అధికారి అంజియ్య, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మార్టూరు: జగనన్న సురక్ష పథకం విజయవంతం చేయడం కోసం అధికారులు సచివాలయ సిబ్బంది గ్రామ వలంటీర్లు విస్తృతంగా ప్రచారం చేయాలని ఎంపీడీవో కే కృష్ణకుమారి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు.

- చీరాలకు వరంగా డయాలసిస్ కేంద్రం
- 64 మంది రోగులకు సేవలు
- జగనన్న ప్రభుత్వంలో రూ. 10 వేల పెన్షన్
- ఆనందం వ్యక్తం చేస్తున్న రోగులు



చీరాలలో నూతనంగా ఏర్పాటు చేసిన వైద్యశాల భవనం



డయాలసిస్ కేంద్రంలో వైద్య సేవలు అందుకుంటున్న రోగులు

కిడ్నీ రోగులకు కొత్త ఊపిరి



చీరాల రూరల్: మన శరీరంలో అన్నిటికన్నా ముఖ్యమైన అవయవం కిడ్నీలు. అన్ని అవయవాలకు రక్తాన్ని శుద్ధి చేసి పంపించే ప్రధానమైనవి ఊపిరితిత్తులు. అలాంటివి పాడయిపోతే మనిషి బతకడం కష్టం. ఇలాంటి తరుణంలో రోగులకు డయాలసిస్ అతిముఖ్యమైనది. వారంలో రెండు నుంచి మూడుసార్లు డయాలసిస్ తప్పనిసరిగా చేయించుకోవాలి. ఇది ఎంతో ఖర్చుతో కూడుకున్నది. గత ప్రభుత్వంలో కిడ్నీ రోగులకు కేవలం రూ.2500 మాత్రమే ఇచ్చి చేతులు దులుపుకుంది. చాలీచాలని పింఛన్‌తో డయాలసిస్ చేయించుకోలేక.. సరైన మందులు కొనుగోలు చేయలేక ఇబ్బందులు రోగులు పడేవారు. అంతేకాదు అప్పు చేసి మరీ డయాలసిస్ చేయించుకునేవారు. ఈకష్టాలన్నింటికీ చెక్ పెడుతూ అప్పుడు ప్రజా సంకల్పయాత్రలో ఇచ్చిన మాట ప్రకారం జగన్ మోహన్‌రెడ్డి సీఎం అయ్యాక రూ. 10 వేలకు పింఛన్ పెంచాడు. అంతేకాకుండా పలు పీహెచ్‌సీల్లో డయాలసిస్ కేంద్రాలు ఏర్పాటు చేసి సుదూర ప్రాంతాలకు రోగులు వెళ్లకుండా ఇబ్బందులు లేకుండా చేశాడు సీఎం జగన్.

ఎటువంటి ఇబ్బందులు లేకుండా డయాలసిస్..



చీరాలలో వైద్య సేవలు కోసం వచ్చే రోగులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా వైద్య సేవలు అందిస్తున్నాం. ఈ ఆస్పత్రిలో డయాలసిస్ కేంద్రంతో పాటు అన్ని రకాల వైద్య సేవలు అందిస్తున్నాం. నిరంతరాయంగా సీటీ స్కాన్ సేవలు, తల్లీబిడ్డల కాన్పుల వార్డు, హెచ్ఐవీ ఎయిడ్స్ వంటి వ్యాధులకు చికిత్సలు అందిస్తున్నాం. 108, 104, వైఎస్సార్ తల్లీబిడ్డల ఎక్స్‌ప్రెస్ వంటి వాహనాలతో నియంతరాయంగా సేవలందిస్తున్నాం.

– డాక్టర్ సుభాషిణి, ఆస్పత్రి సూపరింటెండెంట్

డయాలసిస్ ఏర్పాటుతో రోగులకు తప్పిన ఇబ్బందులు..



పెద్దాసుపత్రులలో చేసే డయాలసిస్ వైద్యం చీరాలలోనే అందిస్తున్నాం. ఇద్దరు వైద్యుల పర్యవేక్షణలో నిరంతరం వైద్య సేవలు అందిస్తున్నాం. కిడ్నీ బాధితుడికి వారానికి రెండు నుంచి మూడుసార్లు క్రియాటిన్ ఆధారంగా డయాలసిస్ చేస్తాం. ఈ 60 మందికే కాకుండా ఇంకో 20 మంది పేషంట్లకు డయాలసిస్ చేసే వెసులుబాటు ఉంది. అవకాశాన్ని చీరాల, చీరాల పరిసర ప్రాంతాలకు చెందిన రోగులు వినియోగించుకోవాలి

– కే. వీరభద్రం, డయాలసిస్ కేంద్ర మేనేజర్

నిబద్ధతతో పనిచేస్తున్న వైద్యులు..

చీరాల ప్రభుత్వాసుపత్రిలో 12 బెడ్లతో ఇద్దరు స్పెషలిస్టు వైద్యులతో కిడ్నీ రోగులకు సేవలందిస్తున్నారు. మొదట్లో కొద్ది మందితో ప్రారంభమైన కేంద్రం ప్రస్తుతం 64 మంది రోగులను అక్కున చేర్చుకుంది. వారికి ఏవిధమైన అసౌకర్యం కలగకుండా సిబ్బంది నిరంతరాయంగా విధులు నిర్వర్తిస్తున్నారు. చీరాలలో డయాలసిస్ కేంద్రం ఏర్పడక ముందు బాధితులు ఎంతో వ్యయ ప్రయాలకోర్చి గుంటూరు, విజయవాడ, హైదరాబాద్ వంటి పెద్ద నగరాలకు వెళ్లి ఎంతో ఖర్చుతో కూడిన వైద్యం చేయించుకునేవారు. ప్రస్తుతం డయాలసిస్ కేంద్రం చీరాలలో ఏర్పాటు చేయడంతో కిడ్నీ బాధితులకు దూరం వెళ్లే సమస్య తొలగిపోయింది.

పెంచిన పింఛన్‌తో తప్పిన బాధలు..



ఈఫొటోలో బెడ్ మీద పడుకున్న వ్యక్తి పేరు తమ్మలూరి ఇస్సాక్. చీరాలలో నివాసం ఉంటున్నాడు. కిడ్నీ రోగి. గత ప్రభుత్వంలో ఇచ్చే పెన్షన్ ఏమూలకు సరిపడక పోవడంతో చేతి నుంచి అప్పులు చేసి చికిత్స చేయించుకునేవాడు. సీఎం జగన్ మోహన్‌రెడ్డి రోగులకు రూ.10 వేలు పెన్షన్ ఇవ్వడంతో బాధలన్నీ తప్పిపోయాయని సంతోషం వ్యక్తం చేశాడు. రెండేళ్లుగా చీరాల ప్రభుత్వాసుపత్రిలో రూపాయి ఖర్చు లేకుండా డయాలసిస్ చేయించుకుంటున్నాడు. సీఎం జగన్‌లాంటి ముఖ్యమంత్రి ఎల్లకాలం ఉంటే నాలాంటి రోగులు హాయిగా ఉంటారని చెమర్చిన కళ్లతో చెప్పాడు.

డయాలసిస్ చేయించుకున్న రోగికి రూ.10 వేలు పింఛన్



బెడ్ మీద పడుకున్న వ్యక్తి పేరు మహమ్మద్ ఇబ్రహీమ్, కర్లపాలెంలో నివాసం ఉంటున్నాడు. గతంలో ఎంతో బాధతో ఇతర ప్రాంతాలకు వెళ్లి వైద్యం చేయించుకోవాల్సి వచ్చేది. చీరాలలో ఏర్పాటు చేసిన తరువాత చాలా హాయిగా ఉంది. వారంలో మూడు సార్లు డయాలసిస్ చేయించుకుంటున్నాడు. బయట ఆస్పత్రుల్లో వైద్యం చేయించుకోవాలంటే నా వల్ల అయ్యే పనికాదని చెప్పాడు. అంత ఖర్చులు నేను భరించేవాడిని కాదు. అంతేకాదు సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి చలవతో రూ. 10 వేలు పెన్షన్ అందుకుంటున్నానని సంతోషంగా చెప్పాడు.

మోడల్ నియోజకవర్గంగా తీర్చిదిద్దడమే లక్ష్యం

- ఎమ్మెల్యే కరణం, నియోజకవర్గ ఇన్‌చార్జి వెంకటేష్



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కరణం

చీరాల: వైఎస్సార్ సీపీ పాలనలో చీరాల నియోజకవర్గంలో గతంలో ఎన్నడూ లేని విధంగా అభివృద్ధి జరిగిందని ఎమ్మెల్యే కరణం బలరామకృష్ణమూర్తి, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి కరణం వెంకటేష్ పేర్కొన్నారు. శనివారం స్థానిక ఐఎంఏ హాలులో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన చీరాల నియోజకవర్గంలో గత నాలుగేళ్ల కాలంలో జరిగిన అభివృద్ధిపై మాట్లాడారు. పంచాయతీరాజ్ శాఖ ఆధ్వర్యంలో గ్రామాల్లో 14, 15 ఆర్థిక సంఘ నిధులతో రూ.20.16 కోట్లతో సీసీ రోడ్లు, ఆర్అండ్‌బీ శాఖ ఆధ్వర్యంలో రూ.15.17 కోట్ల వ్యయంతో తారు రోడ్లు వేశామన్నారు. సుమారు రూ.50 కోట్ల వ్యయంతో జల్‌జీవన్ మిషన్ ద్వారా తాగునీటి ట్యాంకులు, పైప్‌లైనులు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. వైకుంఠపురం ఫ్లైఓవర్ బ్రిడ్జికి రూ.67 కోట్లు నిధులు మంజూరయ్యాయన్నారు. వాడరేవు ఫిషింగ్ హార్బర్ కోసం సీఎం జగన్ రూ.486 కోట్లు నిధులు మంజూరు చేశారన్నారు. అలానే చీరాల, వాడరేవు రోడ్డులో 216 వద్ద ప్రమాదాలు జరుగుతున్న నేపథ్యంలో నూతనల ఫ్లైఓవర్ నిర్మాణానికి నిధులు మంజూరు చేశాన్నారు. పట్టణంలో ఎన్నో సంవత్సరాలుగా సమస్యగా ఉన్న 800 ఇనుక కరెంటు స్తంభాల స్థానంలో కొత్త సిమెంట్ స్తంభాలు ఏర్పాటు చేయడమే కాక లోఓల్టేజ్ సమస్యను కూడా అధిగమించేందుకు నూతన ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేశామన్నారు. కుందేరు అభివృద్ధికి రూ.73 కోట్లు నిధులు కేటాయింపుపై సీఎం దృష్టికి తీసుకెళ్లామన్నారు. కరణం వెంకటేష్ మాట్లాడుతూ చీరాలలో వైఎస్సార్ సీపీని బలోపేతం చేసేందుకు కృషి చేస్తున్నామన్నారు. గ్రామాలు, వార్డుల్లో పర్యటిస్తున్నప్పుడు ప్రజలు పలు సమస్యలను తమ దృష్టికి తీసుకురాగా వాటిని ఎమ్మెల్యేతో చర్చించి వాటి పరిష్కార మార్గాలను చూపామన్నారు. రానున్న ఎన్నికల్లో చీరాలలో వైఎస్సార్ సీపీ జెండా ఎగురవేసేందుకు సంసిద్ధంగా ఉన్నామన్నారు.

ప్రతి ఇంటికీ వెళ్లి సమస్యలు పరిష్కరించాలి



మేదరమెట్లలో మాట్లాడుతున్న శాప్‌నెట్ చైర్మన్ కృష్ణచైతన్య

- శాప్‌నెట్ చైర్మన్ బాచిన కృష్ణచైతన్య

మేదరమెట్ల: వలంటీర్లు, ప్రజాప్రతినిధులు, గృహసారథులు, సచివాలయ ఉద్యోగులు ప్రతి ఇంటికీ వెళ్లి యజమానులతో మాట్లాడాలని శాప్‌నెట్ చైర్మన్, నియోజకవర్గం వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి బాచిన కృష్ణచైతన్య పేర్కొన్నారు. కొరిశపాడు మండలంలోని మేదరమెట్లలో జగనన్న సురక్ష కార్యక్రమాన్ని శనివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా చైతన్య మాట్లాడుతూ ప్రభుత్వం అందచేస్తున్న ప్రతి పథకం అర్హత ఉన్న వారికి అందుతుందా లేదా అని ఎవరికైనా ఎలాంటి సమస్యలు ఉన్నాయని గుర్తించాలన్నారు. సమస్యలను పరిష్కరించే దిశగా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రభుత్వం అందిస్తున్న ప్రతి పథకం గురించి ప్రజలకు వివరించాలన్నారు. రానున్న రోజుల్లో అర్హత ఉండి పథకం అందలేదనే వారు ఏ ఒక్కరూ ఉండకూడదన్నారు. కార్యక్రమంలో ఎండీవో సురేష్‌బాబు, ఎంపీపీ సాధినేని ప్రసన్నకుమారి, సర్పంచ్ బొనిగల ఎలిశమ్మ, ఈవో శ్రీనివాసరావు, నాయకులు, వలంటీర్లు, సచివాలయ ఉద్యోగులు, గృహసారథులు పాల్గొన్నారు.

కొరిశపాడు తహశీల్దార్‌గా సుశీల



తహసీల్దార్‌గా బాధ్యతలు స్వీకరిస్తున్న సుశీల

మేదరమెట్ల: కొరిశపాడు మండల తహశీల్దార్‌గా బీ.సుశీల శనివారం బాధ్యతలు చేపట్టారు. గతంలో ఆమె బాపట్ల జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్‌గా పనిచేశారు. ఈ సందర్భంగా తహశీల్దార్ మాట్లాడుతూ మండల ప్రజలకు అందుబాటులో ఉంటూ నిష్పక్షపాతంగా తన బాధ్యతలు నిర్వహిస్తానని పేర్కొన్నారు.

26న ఏపీ మోడల్ స్కూల్‌లో ప్రవేశాలు

చీరాల అర్బన్: చీరాలలోని ఏపీ మోడల్ స్కూల్‌లో 7,8,9 తరగతుల ప్రవేశాలకు విద్యార్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ జే సరళ తెలిపారు. ఆసక్తి గల విద్యార్థులు రూ.100 ఫీజు చెల్లించాలన్నారు. సోమవారం ఉదయం 9గంటలకు చీరాల ఏపీ మోడల్ స్కూల్‌లో ప్రవేశపరీక్ష నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పరీక్ష ఇంగ్లీషు మీడియంలో నిర్వహిస్తారని, తెలుగు, ఇంగ్లిషు, హిందీ, గణితం, సైన్సు, సోషల్ సబ్జెక్టులలో 100 మార్కులకు పరీక్ష ఉంటుందన్నారు. మెరిట్, రోస్టర్ ఆధారంగా జిల్లా విద్యాకమిటీ వారిచే ఎంపిక చేస్తారన్నారు.

నేడు సచివాలయం ప్రారంభం

బల్లికురవ: మండలంలోని కొప్పరపాలెం గ్రామంలో నూతనంగా నిర్మించిన సచివాలయాన్ని ఆదివారం ఉదయం 10 గంటలకు ప్రారంభిస్తున్నట్లు మండలపార్టీ కన్వీనర్, బాపట్ల జిల్లా రైతు అధ్యక్షుడు చింతల పేరయ్య శనివారం తెలిపారు. ప్రారంభ కార్యక్రమానికి రాష్ట్ర శాప్‌నెట్ చైర్మన్, నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి బాచిన కృష్ణచైతన్య ముఖ్యఅతిథిగా హాజరవుతారని చెప్పారు. అనంతరం కే. రాజుపాలెం గ్రామంలో రక్షిత మంచినీటి పథకం గురించి ఏర్పాటు చేసిన పైపులైన్ పనులను చైతన్య ప్రారంభిస్తారని చెప్పారు. కార్యక్రమాల్లో మండలస్థాయి అధికారులు, ప్రజాప్రతినిధులు హాజరుకావాలని పేరయ్య కోరారు.

మత్స్యకార గ్రామ అభివృద్ధికి సహకారం



గ్రామంలో రచ్చబండను ప్రారంభించిన రోటరీ సభ్యులు

వేటపాలెం: మత్స్యకార గ్రామ అభివృద్ధికి చీరాల రోటరీ క్లబ్ సహకారం అందిస్తుందని చీరాల రోటరీ క్లబ్ అడ్మినిస్ట్రేషన్ డైరెక్టర్ పోలుదాసు రామకృష్ణ తెలిపారు. మండల పరిధిలోని రామాపురం మత్స్యకార గ్రామంలో చీరాల రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో రూ. 20 వేలతో ఏర్పాటు చేసిన వివిధ అభివృద్ధి పనులను క్లబ్ సభ్యులు శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా క్లబ్ సభ్యులు మాట్లాడుతూ మత్స్యకార గ్రామాన్ని రోటరీ క్లబ్ దత్తత తీసుకున్నారని చెప్పారు. గ్రామ పెద్దల కోరిక మేరకు గ్రామం మధ్యలో రచ్చబండ ఏర్పాటు, కమ్యూనిటీ హాలు ఫ్లోరింగ్, వంటి మౌలిక వసతులు కల్పిస్తారని చెప్పారు. ప్రజలు కూర్చోడానికి నాలుగు సిమెంట్ బల్లలు ఏర్పాటు చేశామని చెప్పారు. కార్యక్రమంలో క్లబ్ సభ్యులు డాక్టర్ బాబూరావు, కృష్ణమూర్తి, సుభాషిణి, మురళీకృష్ణ, ఎస్వీ స్వామి, చింతా రమేష్, డేగల తిరుపతిరావు, గ్రామ పెద్దకాపులు పాల్గొన్నారు.

గడప గడపకూ సంక్షేమం



మహిళకు నమస్కరిస్తున్న శాప్‌నెట్ చైర్మన్ కృష్ణచైతన్య

- శాప్‌నెట్ చైర్మన్ బాచిన కృష్ణచైతన్య

మేదరమెట్ల: వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయిన తరువాత ప్రతి గడపలో సంక్షేమ పథకాలు అందుతున్నాయని శాప్‌నెట్ చైర్మన్, నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి బాచిన కృష్ణచైతన్య పేర్కొన్నారు. కొరిశపాడు మండలంలోని యర్రబాలెంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలు అందించేలా జగనన్న ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. ప్రభుత్వ పథకాలకు చెందిన బుక్‌లెట్‌లను లబ్ధిదారులకు అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ నాగరాజు, ఎంపీపీ ప్రసన్నకుమారి, సాధినేని శ్రీనివాసరావు, సాధినేని మస్తాన్‌రావు, స్థానిక నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఫ్యామిలీ ఫిజీషియన్‌తో ఇంటింటికీ వైద్యం

బల్లికురవ: ప్రభుత్వ ప్రవేశపెట్టిన ఫ్యామిలీ ఫిజీయన్‌తో మంచాల్లో ఉన్న వృద్ధులు, చిన్నారులకు ఇంటింటికి వెళ్లి వైద్యసేవలు అందిస్తున్నట్లు గుంటుపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి మమత అన్నారు. శనివారం ఎస్ఎల్ గుడిపాడు పంచాయతీలోని సుజాత నగర్ కాలనీలో 104 శిబిరంలో భాగంగా పాఠశాలలోని మధ్యాహ్న భోజనాన్ని తనిఖీ చేశారు. శిబిరానికి రాలేని వృద్ధులు, చిన్నారులను ఇంటింటికి వెళ్లి పరీక్షించారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది బాలాజీ, శ్రీనివాసరావు, సంధ్యారాణి, విజయలక్ష్మి, పాల్గొన్నారు.

భూ యజమానులు సహకరించాలి



గుర్తింపు కార్డులు అందిస్తున్న తహసీల్దార్ పద్మావతి

జే.పంగులూరు: భూ యజమానులు కౌలు రైతులకు సహకరించాలని తహసీల్దార్ ఐ పద్మావతి కోరారు. మండలంలోని కొండమూరు గ్రామంలో రైతులకు సీసీఆర్సీ (కౌలు కార్డులు) మీద అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ భూ యజమానుల పాస్‌బుక్ జిరాక్సులు కౌలు రైతులకు ఇచ్చి అంగీకార పత్రం మీద సంతకం చేస్తే కౌలు రైతులకు ప్రభుత్వం కార్డులు ఇస్తుందన్నారు. దీని వలన భూ యజమానికి, కౌలు సాగుదారుడు ఇద్దరికీ రైతు భరోసా వర్తిస్తుందని తెలిపారు. కష్టపడి వ్యవసాయం చేసి పంటలు పండించే కౌలు రైతులకు అన్యాయం జరగకుండా చూడాల్సిన బాధ్యత యజమానులపై ఉందన్నారు. ఏవో డి సుబ్బారెడ్డి మాట్లాడుతూ గ్రామంలో కౌలు రైతులు అధికంగా ఉన్నారని, ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా కౌలు కార్డులు పొందాలని తెలిపారు. అనంతరం కొంతమంది కౌలు రైతులకు తహసీల్దార్ కౌలు కార్డులను అందజేశారు. కార్యక్రమంలో వీఆర్వో రవి, వ్యవసాయ సహాయకులు దినేష్, పలువురు రైతులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో గొర్రెలు మృతి

మార్టూరు: మేత కోసం వెళ్లిన గొర్రెలు విద్యుదాఘాతంతో మృతి చెందిన ఘటన మండలంలోని కోలలపూడి గ్రామ సమీపంలో శనివారం సాయంత్రం జరిగింది. స్థానికుల వివరాల మేరకు.. కోనంకి గ్రామానికి చెందిన తాళ్లూరి రాంబాబుకు సంబంధించిన గొర్రెల మంద మేత కోసం సమీప గ్రామమైన కోలలపూడి పొలాల వైపు వెళ్లాయి. ఈ క్రమంలో ఓ విద్యుత్ స్తంభం వద్ద తెగిపడి ఉన్న విద్యుత్ తీగలు ప్రమాదవశాత్తు గొర్రెలకు తగిలి మూడు గొర్రెలు అక్కడికక్కడే మృతి చెందాయి. వీటి విలువ సుమారు రూ. 60 వేలు ఉంటుందని బాధితుడు రాంబాబు వాపోయాడు.

ఆశ్రమంలో వస్త్రాలు, స్టేషనరీ పంపిణీ



వస్తువులు పంపిణీ చేస్తున్న బేబీరాణి

చీరాల రూరల్: ప్రకాశం జిల్లా పశుసంవర్ధకశాఖ జాయింట్ డైరెక్టర్ బేబి రాణి పుట్టిన రోజు సందర్భంగా శనివారం చీరాలలోని అనాథ ఆశ్రమంలో పిల్లలకు పుస్తకాలు, స్టేషనరీ సామాన్లు అందించారు. అలానే వృద్ధాశ్రమంలో వృద్ధులకు వస్త్రాలు అందించారు. కార్యక్రమంలో రాష్ట్ర వైఎస్సార్ సీపీ కార్యదర్శి డాక్టర్ వరికూటి అమృతపాణి, అమ్మ కంటి హాస్పిటల్ డైరెక్టర్ వరికూటి భరత్, రోటరీ క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

జులై 1 నుంచి గ్రామసభలు

కారంచేడు: జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు జులై 1వ తేదీ నుంచి మండలంలోని అన్ని గ్రామ సచివాలయాల పరిధిలో జగనన్న సురక్ష కార్యక్రమంలో భాగంగా గ్రామసభలు నిర్వహించి లబ్ధిదారులను ఎంపిక చేస్తామని ఎంపీడీవో డీ విజయలక్ష్మి పేర్కొన్నారు. శనివారం ఆమె స్థానిక మండల పరిషత్ సమావేశ హాలులో మాట్లాడుతూ జులై 1న ఆదిపూడి, తిమిడెదపాడు గ్రామాల్లో, 7న స్వర్ణ-1, స్వర్ణ-2 సచివాలయాల్లో, 10న కుంకలమర్రులో, 15న దగ్గుబాడు, కారంచేడు-1లోను, 20న జరుబులవారిపాలెం, కొడవలి వారిపాలెం సచివాలయాల్లో, 26న కారంచేడు గ్రామ సచివాలయాల్లో గ్రామ సభలు ఉంటాయన్నారు.